

## పాపం పండి ఫాంహౌస్‌కు పరిమితమైన కేసీఆర్

- **పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**

**త్రినేత్ర.న్యూస్:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాపం పండి ఫాంహౌస్‌కు పరిమితమయ్యారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఇండ్ల పేరుతో బీఆర్ఎస్ ఓట్లు దండుకుందని ఆరోపించారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ హయంలో అల్లుడు వస్తే ఎక్కడ పడుకుంటాడు ఎగతాళి చేసి ఇండ్లు నిర్మించలేని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. శాసన మండలిలో ఇందిరమ్మ ఇండ్లపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఇందిరమ్మ ఇండ్లు గొప్ప కార్యక్రమని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 2 లక్షలకు పైగా ఇండ్లు నిర్మించడం శుభపరిణామమని తెలిపారు. దేశంలో పేదోడి సొంతింటి కలను కాంగ్రెస్ పార్టీ సాకారం చేసిందని వెల్లడించారు. నిజామాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని చెప్పారు.



## సభలో మాట్లాడలేకే బీఆర్ఎస్ నేతల డైవర్షన్ పాలిటిక్స్

- **ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్**

**త్రినేత్ర.న్యూస్ :** సభలో మాట్లాడలేకే బీఆర్ఎస్ నేతలు డైవర్షన్‌పాలిటిక్స్ చేస్తున్నారని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. తెలంగాణలో వేల ఎకరాల భూములను చరబట్టిన చరిత్ర బీఆర్ఎస్ నేతలది కాదా అని ప్రశ్నించారు. 22పై కూడా ప్రభుత్వమే చర్చకు సిద్ధంగా ఉందని చెప్పినా ఆరోపణలు చేయడం వాళ్ల అవివేకమన్నారు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడే దమ్ములేకనే తప్పించుకునే ప్రయత్నం చేశారని బల్మూర్ వెంకట్ విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలకులు ధరణి పేరుతో నిషేధిత జాబితాలో పెట్టిన భూమ్ములకంటే... ఇప్పుడు 22ఏలో పెట్టిన భూములు తక్కువేనని పేర్కొన్నారు.



## కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్లు

**త్రినేత్ర.న్యూస్:** రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్లకు శుభవార్త. క్యూర్ పరిధి వెలుపల ఉన్న 9 మున్సిపల్ కార్పొరేషన్లలో కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్లను నియమించనున్నట్టు శాసనసభలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రతి కార్పోరేషన్‌లో ఒకరిని ఎంపిక చేస్తామని తెలిపారు. తెలంగాణ మున్సిపల్ చట్టం–2019కి సవరణ కోరుతూ ఈ మేరకు ఆయన బిల్లు ప్రవేశపెట్టారు. సామాజికంగా వివక్ష ఎదుర్కొంటున్న ట్రాన్స్ జెండర్లను ప్రధాన స్రవంతిలో కి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి పలు కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. అణగారిన వర్గాలు, సంచార జాతులతో పాటు సమాజంలో వెనుకబడిన ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి పాలనాపరమైన నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించడం ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. స్థానిక సంస్థల సమావేశాల్లో కో–ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్లు భాగస్వాములు అవ్వడం ద్వారా వారి సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లే అవకాశం లభిస్తుంది అని పేర్కొన్నారు.

## 1.50 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నా..

# 15 వేల ఉద్యోగాలు లేవు

- **ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్**

**త్రినేత్ర.న్యూస్:**

డాటా సెంటర్ల వల్ల రాష్ట్రానికి పెద్దగా ఒరిగేదేమీ లేదని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ అన్నారు. లక్షల కోట్లలో పెట్టుబులు వస్తున్నా.. ఆశించిన మేర ఉద్యోగాల కల్పన జరగడం లేదని చెప్పారు. తెలంగాణలో టీసీఎస్ హైపర్‌వాల్ట్, ఫార్చ్యూన్ కంపెనీలు రూ.1.50 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినప్పటికీ 10 వేల నుంచి 15 వేల ఉద్యోగాలు కూడా కొత్తగా రావడం లేదన్నారు. శాసన సభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా పాల్వాయి హరీశ్ మాట్లాడుతూ..

`హైదరాబాద్‌లో ఐటీ భూమ్ ప్రారంభమై 30 ఏండ్లు కావస్తున్నది. 1996 నుంచి 2026 వరకు గత 30 ఏండ్లలో ఐటీ ఉద్యోగార్థులకు ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులు ఉన్నాయ. ఐటీ ఉద్యోగులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. ప్రతి ఏడాది వేల సంఖ్యలో ఇంజినీరింగ్ పట్టభద్రులు కాలేజీల నుంచి బయటకు వస్తున్నారు. వాస్తవానికి వారంతా ఐటీ రంగంలో ఉద్యోగాలు పొందాలి. ఈ ఏడాది క్యాపస్ రిక్రూట్‌మెంట్‌లో 86 శాతం మందికి ప్లేస్‌మెంట్లు రాలేదు. చిన్నచిన్న ఇంజినీరింగ్ కాలేజీలే కాదు.. టాప్ 10 కాలేజీల్లోనూ విద్యార్థులకు ఉద్యోగాలు దక్కలేదు. హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ కాలేజీలే కాదు.. ఐఐటీ కాలేజీ విద్యార్థులకు కూడా ఈ ఏడాది క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో



ఉద్యోగాలు రాలేదు.

**ఐటీ టవర్లలో వడ్లు ఎండబోస్తున్నరు..**

సిద్దిపేటలోని ఐటీ టవర్‌లో రైతులు వడ్లు ఎండబోసుకుంటున్నరు. రూ.52 కోట్లతో కట్టిన ఐటీ టవర్‌లో ఉద్యోగాల కల్పన లేకపోవడంతో రైతులు దానిని ఉపయోగించుకున్నారు. చాలా దయనీయం. కరీంనగర్‌లో కూడా అలాంటి పరిస్థితే ఉంది. ఇలా నేల విడిచి సాముచేస్తే మంచికాదు. కనీసం ఐటీఈఎస్ (ఐటీ ఎనేబుల్డ్ సర్వీసెస్) లేదా బీపీఓ సర్వీసులను జిల్లాల్లోని ఐటీ టవర్లలో ఏర్పాటు చేయాలి. కాల్ సెంటర్లు నడిపేవారు కూడా హైదరాబాద్‌కే వస్తున్నరు.

**పేరుకే లక్ష కోట్ల పెట్టుబడులు..**

టీసీఎస్ హైపర్‌వాల్ట్ రూ.70 వేల కోట్లతో 1 గిగావాట్ సామర్థ్యంతో 264 ఎకరాల్లో పెద్ద డాటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఉద్యోగాలు వస్తున్నది మాత్రం 5 వేల నుంచి 7 వేలు మాత్రమే. డేటా సెంటర్ల గురించి ప్రపంచ దేశాలు ఆలోచిస్తున్నాయి. 24 గంటల పాటు కరెంటు, నీళ్లు వినియోగిస్తాయి. నీళ్ల కొతర ఉన్న మన రాష్ట్రానికి డాటా సెంటర్ల వల్ల ఏం ఉపయోగం?. `అని ప్రశ్నించారు.

# బీసీలకు రిజర్వేషన్లు దానం కాదు.. అది మా హక్కు

- **బీసీల జనాభా లెక్కలు తేల్చాలి**
- **శాసనసభలో మంత్రి వాకిటి శ్రీహరి**

**త్రినేత్ర.న్యూస్ :**

దేశవ్యాప్తంగా బీసీల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, అది బీసీల హక్కు, సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటం ఫలితమని మంత్రి స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీలో కులగణనపై జరిగిన చర్చలో మంత్రి వాకిటి మాట్లాడారు.

1953లో అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం కాకా కాలేల్కర్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం 1979లో బి.పి. మండల్ కమిషన్ ఏర్పడి దేశవ్యాప్తంగా బీసీల సామాజిక, విద్యా వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ సిఫార్సు చేసిందని, 1990లో ఆ సిఫార్సుల అమలుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని గుర్తు చేశారు.

1992లో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి కీలకమైన మార్గ



దర్శకాలు ఇచ్చిందన్నారు. 1993లో జాతీయ వెనుక బడిన తరగతుల కమిషన్ ఏర్పడిందని, 2018లో 102వ రాజ్యాంగ సవరణ ద్వారా దానికి రాజ్యాంగ హోదా లభించిందని తెలిపారు. ఓబీసీ రిజర్వేషన్ల ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందు తున్నాయా అనే అంశాన్ని పరిశీలించేందుకు జస్టిస్ రోహిణి కమిషన్‌ను కూడా కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు.

**తెలంగాణలో సమగ్ర కుల సర్వే చారిత్రక నిర్ణయం**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే సామాజిక న్యాయానికి పునాది అని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. "ఇది కేవలం ఒక సర్వే కాదు.. సామాజిక న్యాయానికి పునాది. బీసీల హక్కులకు బలమైన ఆధారం" అని మంత్రి పేర్కొన్నారు.

- **గోపాలమిత్రలకు ప్రాధాన్యం**

పాడి రంగంలో క్షేత్రస్థాయిలో కీలక సేవలు అందిస్తున్న గోపాలమిత్రల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గోపాలమిత్రలకు మెడిక్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద బీమా, సకాలంలో గౌరవ వేతనం, శిక్షణ, సాంకేతిక సహాయం, పర్యవేక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి క్రమంగా పెరుగుతోందని మంత్రి తెలిపారు. 2024–25లో 59.35 లక్షల టన్నులు, 2025–26లో 61.75 లక్షల టన్నుల పాల ఉత్పత్తి నమోదైందన్నారు. 2026–27లో ఆరు నెలల కాలానికి సుమారు 30 లక్షల టన్నుల పాల ఉత్పత్తి జరుగుతుందని ముందస్తు అంచనా ఉన్నట్లు వెల్లడించారు. 2026 ఆగస్టు 16 నుంచి గేదె పాలకు ప్రతి కిలో వెన్నకు రూ.914, ఆవు పాలకు ప్రతి కిలో వెన్నతో పాటు మొత్తం ఘన పదార్థాల ప్రాతిపదికన రూ.340 ధరలను నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. ఆక్సిటోసిన్ ఇంజిక్షన్ల వినియోగాన్ని నిరోధించేందుకు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ప్రత్యేకమైన ప్రతిపాదన లేదన్నారు.

# ఎన్‌హెచ్‌ఆర్సీకి బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదు

**త్రినేత్ర.న్యూస్:**

ఇటీవల తెలంగాణ అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యురాలు విజయ భారతిని కలిసి ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో తమపై జరిగిన దాడి తీరును ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా వివరించారు. మహిళా ఎమ్మెల్యేలను పోలీసుల చేత అవమానించడం, అసెంబ్లీలోకి వెళ్ళనివ్వకుండా అడ్డుకోవడం, శాసనసభ్యులుగా తమ హక్కులకు విఘాతం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యేలపట్ల కీచకంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ వద్ద తమకు జరిగిన అవమానం చాలా బాధ అనిపించింది. కుట్రలో భాగంగానే ఇదంతా జరిగిందని



అర్థమవుతోంది. అసెంబ్లీకి వెళ్తుంటే యుద్ధ వాతావరణం సృష్టించారు. దాడి ఘటనపై అసెంబ్లీలో ఒక్క నిమిషం మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. స్పీకర్, సీఎం, శాసనసభ వ్యవహారాల మంత్రి స్పందిస్తారని భావించాం. వాళ్లు స్పందించలేదు. అందుకే ఈరోజు ఫిర్యాదు చేశాం అని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.